ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024 | 5 | అనంతపురం



జెడ్పీ సిఇఒగా నదియా దేవి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ సిఇఒగా ఐఎఎస్ అధికారి నదియాదేవిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఐఎఎస్ ట్రైనింగ్ పూర్తిచేసుకుని పోస్టింగు కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నదియాదేవిని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కింద జెడ్పీ సీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులు ఈనెల 8న జారీ అయినట్లు తెలుస్తోంది. ఈమె శుక్రవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.



అంగన్వాడీల ఆగ్రహజ్వాల..!

సమ్మె 30వ రోజు



కలెక్టరేట్ ఎదుట 30వ నెంబర్ ఆకారంలో కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

తమ సమస్యల పరిష్కారం కోసం అనంతపురం జిల్లాలోని ఆయా మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 30వ రోజుకుచేరుకుంది. ఈసందర్భంగా అనంతపురం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు వినూత్న నిరసన చేపట్టారు. తాము సమ్మె చేపట్టి 30 రోజులు అయిన సందర్భంగా 30వ సంఖ్య ఆకారంలో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు.

వార్తలు 6లో

మున్సిపల్ కార్మికుల నిరసన హోరు

సమ్మె 16వ రోజు

తమ సమస్యల పరిష్కారం కోసం అనంతపురం జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో మున్సిపల్‌కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజు కొనసాగింది. ఆయా మున్సిపాలిటీల్లో అంగన్వాడీలు బుధవారం వినూత్న నిరసన చేపట్టారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్మికులు కార్యాలయాల్లో, ప్రధాన రహదారులలో హుండీలు పెట్టుకుని భిక్షాటన చేసి ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు 16 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

వార్తలు 6లో



అనంతపురంలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

నిమ్మకాయ గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

విషాదంలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఇంటి వద్దనే ఎంతో ఉత్సాహంగా ఆడుకుంటున్న చిన్నారిని మృత్యువు ఓ నిమ్మకాయ రూపంలో చిదిమేసింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లి గ్రామానికి చెందిన వాలంటీరు సకీదీప, గోవిందరాజులు దంపతులకు ఏడేళ్ల అనంతరం జశ్విత (9నెలలు) అనే చిన్నారి జన్మించింది. ఎంతో అల్లారి ముద్దుగా చూసుకుంటున్న ఆ చిన్నారి బుధవారం సాయంత్రం ఇంట్లో ఆడుకుంటోంది. దీంతో తల్లిదండ్రులు వారి పనిలో నిమగ్నమయ్యారు. ఈనేపథ్యంలో ఇంటి వరండాలో పడిన నిమ్మకాయను చిన్నారి నోట్లో పెట్టుకుంది. గమనించిన తల్లి సకీదీప చిన్నారి నోట్లో నిమ్మకాయను తీయబోయినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే చికిత్స నిమిత్తం పెద్దవడుగూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చిన్నారి శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నందున మెరుగైన వైద్యం కోసం పామిడి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు గుర్తించారు. చిన్నారి మృతితో ఆమె తల్లిదండ్రులు చేసిన రోదనలు కంటతడి పెట్టించాయి. ఏడేళ్ల తర్వాత పుట్టిన బిడ్డ తమకు లేకుండా చేస్తివా దేవుడా అంటూ రోధించారు.



చిన్నారి మృతదేహంపై పడి రోదిస్తున్న తండ్రి

అటకెక్కిన ఆధునీకరణ పనులు

నీళ్లు లేవంటూ జగడాలు

నిధులు రాబట్టడంలో మౌనం



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి ఆవశ్యకత చాలా అవసరముంది. అయితే ఉన్న అతి కొద్ది సాగునీటి వసతిని సక్రమంగా అందించే నీటి వ్యవస్థల్లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనున్న ఏకైక ప్రధాన ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ సిస్టమ్ కింద అనేక ఉప కాలువలు ఉన్నాయి. ఇప్పుడు ఈ వ్యవస్థలన్నీ పూర్తి దెబ్బతిన్నాయి. వీటిని బాగు చేసేందుకు చేపట్టిన ఆధునీకరణ పనులన్నీ అర్థాంతరంగా ఆగిపోయాయి. వీటిని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై నేతలు ఒత్తిడి పెంచిన దాఖలాలు కనిపించలేదు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 12 మంది వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్న విమర్శలున్నాయి.

అటకెక్కిన ఆధునీకరణ పనులు

ఆగిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ :

తుంగభద్ర డ్యామ్ నుంచి అనంతపురం జిల్లాకు సాగునీటి వనరు ఇచ్చిన ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు 2008లో ప్రారంభమయ్యాయి. నాలుగేళ్లలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువను పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతోపాటు ప్రవాహ సామర్థ్యాన్ని 2000 క్యూసెక్కుల నుంచి 4200 క్యూసెక్కులకు పెంచారు. ఆరు ప్యాకేజీలతో రూ.458.72 కోట్లతో చేట్టారు. ఇందులో 309.74 కోట్లు పూర్తయ్యాయి. అయితే ఆ తరువాత పనులను ఆపివేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 2019లో రద్దు చేసింది.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ ఆపమని కాంట్రాక్టరు వినతి

శింగనమల నియోజకర్గానికి సాగు,తాగునీటిని అందించే మిడ్ పెన్నార్ దక్షిణ కిలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇక పనులు చేయలేమని రద్దు చేయమని కాంట్రాక్టరు విజ్ఞప్తి చేయడం గమనార్హం. మిడ్‌పెన్నార్ డ్యామ్ నుంచి 84 కిలోమీటర్ల మేరకు ఈ కాలువ ఉంది. రూ.509.16 కోట్లతో పనులు చేపట్టడంతో రూ.205.79 కోట్లు పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆ పనులు ఆగిపోయాయి.

గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పనులు చేయలేం

గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. రూ.293.22 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.188 కోట్లు పూర్తయ్యాయి. ఈ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వీటిని చేయలేమని పనులు రద్దు చేయమని కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేశారు. ఇలా ప్రధానమైన కాలువ పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయి.

అనంతపురం కార్పొరేషన్ కమిషనర్‌గా మేఘ స్వరూప్

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ గా ఐఎఎస్ క్యాడర్ అధికారి మేఘస్వరూప్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎఎస్ ట్రైనింగ్ ముగించుకొని పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న మేఘస్వరూప్‌ను అనంతపురం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న కమిషనర్ భాగ్యలక్ష్మి ని బదిలీ చేస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది ఇందుకు సంబంధించి ఉత్తర్వులు రాకకై ఆమె ఎదురుచూస్తున్నారు. నూతన కమిషనర్ మేఘ స్వరూప్ కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.



మేఘస్వరూప్

నిరుపయోగ వస్తువులతో బెంచీలు తయారీ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వర్క్‌షాపు సిబ్బంది నిరుపయోగంగా ఉన్న బెంచీలను రీమోడల్ చేసి విద్యార్థులకు ఉపయోగంలోకి తీసుకొచ్చారు. దీంతో విసి రంగజనార్ధనతోపాటు న్యాక్ కమిటీ సభ్యులు టి.త్యాగరాజన్, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, జి.వి.సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, ఎం.రామశేఖరరెడ్డి, వర్క్‌షాపు ఇన్‌ఛార్జి ఆఫీసర్ పి.ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియును సందర్శించిన న్యాక్ బృందం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియును న్యాక్ బృందం బుధవారం సందర్శించింది. ఇందులో భాగంగా చెన్నై అన్నా యూనివర్సిటీ ప్రొఫెసర్ టి.త్యాగరాజన్ ఆధ్వర్యంలో వచ్చిన కమిటీ సభ్యులకు ఉపకులపతి జి.రంగజనార్ధన వర్శిటీ వివరాలను ప్రజెంటేషన్ చేశారు. ముఖ్యంగా సిలబస్ రూపకల్పన, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్, ఔట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, స్టూడెంట్ ప్యాకల్టీ నిష్పత్తి, ఉత్తీర్ణత, రీసెర్చ్, జాతీయ ర్యాంకింగ్, ఎన్‌బిఎ వంటి వివరాలను వివరించారు. అనంతరం కళాశాలలో లైబ్రరీ, సెంట్రల్ కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రికల్ విభాగం, మెకానికల్ విభాగం, ఎలక్ట్రానిక్స్ విభాగం, కంప్యూటర్ సైన్సు విభాగాలను సందర్శించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ఐ క్యూసి డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, కిరణ్మయి, సి.శోభాబిందు, పద్మ సువర్ణ, ఎ.సురేష్‌బాబు, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.విశాలి, పి.సుజాత, వి.చిత్ర, అనంతపురం కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, పులివెందుల కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రమణారెడ్డి, కలికిరి కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



జెఎన్‌టియులో సమావేశమైన న్యాక్ బృందం

కళ్యాణదుర్గం, రాయదుర్గం నుండి స్వతంత్రంగా పోటీ

ప్రభుత్వ విప్. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయదుర్గం

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల నుంచి తాను, తన కుటుంబ సభ్యులు ఎన్నికల బరిలో ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి చెప్పారు. అమరావతిలో తాను వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన అనంతరం బుధవారం రాయదుర్గంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తొలుత తనకు కళ్యాణదుర్గం అసెంబ్లీ టికెట్ ఇస్తామని చెప్పిన అధిష్టానం అనంతరం ఎక్కడా టికెట్ ఇవ్వడం లేదని చెప్పిందన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజాసేవ చేసిన తనకు టికెట్ లేదని సమాధానం రావడంతో నిరాశ చెందిన తాను స్వతంత్ర అభ్యర్థిగానైనా తాను పుట్టిన సొంత నియోజకవర్గం కళ్యాణదుర్గంలో పోటీలో ఉండాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తనకు రాయదుర్గం, కళ్యాణదుర్గం రెండు కళ్ల లాంటివి అని అన్నారు. నేడు తనకు ఈ స్థాయిని కల్పించిన రాయదుర్గాన్ని ఎన్నటికీ మరిచిపోనన్నారు. అలాగే పుట్టి పెరిగిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సేవ చేసే అవకాశం కోసం తాను ఈసారి అక్కడి నుండి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. తన ఆప్తులు, కుటుంబ సభ్యులు రాయదుర్గం నుండి ఎన్నికల బరిలో ఉంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ తనకు ఏ పార్టీ అవకాశం ఇచ్చినా కళ్యాణదుర్గం నుండి పోటీకి సిద్ధం అని అనాడే వెల్లడించానన్నారు. 2008 సంవత్సరంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కళ్యాణదుర్గం నుండి పోటీ చేయమని సూచించినా మడకశిర నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ కావడంతో సీనియర్ కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి కళ్యాణదుర్గం నుండి పోటీ చేయగా తాను రాయదుర్గంనుంచి పోటీ చేయాల్సి వచ్చింది అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ వచ్చినా పోటీకి సిద్ధమన్నారు. తన ఈ స్థితికి కారణమైన అహర్నిశలు చిత్తశుద్ధితో పనిచేసిన కార్యకర్తలు నాయకుల రుణం తీర్చుకుంటానన్నారు. తాను ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని, కష్టకాలంలో పారిపోయే వ్యక్తిని కాదని అన్నారు. ముందు నుంచి తాను పార్టీ కార్యకర్తల వెన్నంటే ఉన్నానన్నారు. ఎన్నికలలో గెలవాలని ఆశించే వ్యక్తి తనపై, తన అనుచరులపై బండ బూతులు సోషల్ మీడియాలో తిడుతున్నారని,మండల కన్వీనర్ వన్నూరు స్వామి, అతని భార్య ఎంపీపీని బెదిరిస్తున్నారని చెప్పారు. కొందరు వైసిపి నాయకులకు డబ్బు ఎరవేసి లోపర్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలియ వచ్చిందన్నారు. రాయదుర్గం టికెట్ ఇంతవరకు ప్రకటించనప్పటికీ అంతా అయినట్లు సంబరపడుతున్నారని ఇల్లు అలికినంత మాత్రాన పండుగ అయినట్లు కాదని అన్నారు. సోషల్ మీడియాలో తనకు వ్యతిరేకంగా తప్పుడు పోస్టులు పెడితే వారికి తగిన సమయంలో తగిన రీతిన సమాధానం చెబుతానని హెచ్చరించారు. సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టి సిద్దప్ప, మున్సిపల్ వార్డు సభ్యులు గోవింద, పెద్ద వన్నూరప్ప, షబ్బీర్, ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో వైసిపి ప్రభుత్వం విఫలం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా ఏవర్గం సంతోషంగా, సుఖంగా లేదన్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంటలన్నీ నాశనమయ్యాన్నారు. ముఖ్యంగా మర్తాడు గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా చేయలేకపోవడంతో పంటలు ఎండిపోయి పంట దిగుబడి తగ్గిందన్నారు. వెంటనే పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాలువలకు నీరు విడుదల చేయుటలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి పంటలు ఎండిపోవడానికి కారణమైందని విమర్శించారు. రానున్న కాలంలో చంద్రబాబును అధికారంలోకి తీసుకొచ్చి సిఎంను చేస్తేనే రైతులు, ప్రజల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా నాగరాజు, రమణప్ప, రాజు, సామల మధు, తదితరులు పాల్గొన్నారు.



వరి కోత కూలీలతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

ఎస్‌కెయు రిజిస్ట్రార్‌కు సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎ.వి.లక్ష్మయ్యను అకడమిక్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పరిపాలన భవనంలో ఘనంగా సత్కరించారు. లక్ష్మయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని సన్మానించినట్లు కన్వీనర్ సయ్యద్ హుసేని తెలిపారు. ఈకార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్ రమ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, వీర్రాజు, గోపాల్, వెంకటరామిరెడ్డి, శ్రీవనివాసరెడ్డి, తన్నీరు నాగేంద్ర, నానీల నాగేంద్ర, జగదీష్, జమ్మన్న, సాకేరాజు, ఆదిశేఖర్‌రెడ్డి, శీన, కరుణాకర్, దస్తగిరి పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-ఉరవకొండ

చెక్‌పోస్టుల్లో పకడ్బం దీగా వాహనాల తనిఖీలు చేపట్టాలని గుంతకలు డీఎస్పీ నర్సింగప్ప సూచించారు. బుధవారం విడపనకల్ మండల పరిధిలోని హావలిగి, విడపకకల్, డోనేకల్ గ్రామాల శివారుల్లో ఉన్న చెక్‌పోస్టలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్ణాటక నుంచి ఎక్కువగా మద్యాన్ని తరలిస్తుంటారన్నారు. అలాంటి వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇసుక రవాణా చేస్తున్న వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పాల్తూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీసులు ప్రజలతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సెబ్ సీఐలతోపాటు పాల్తూరు, విడపనకల్ ఎస్ఐలు తిప్పయ్యనాయక్, ఖాజాహుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింగప్ప

గ్రంథాలయం తనిఖీ

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి రమ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అలాగే పాఠకులకు అవసరమైన పుస్తకాలను తెప్పించుకోవాలని గ్రంథాలయ అధికారికి సూచించారు. ఇకపోతే పంచాయతీల నుంచి గ్రంథాలయ పనులు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి విజయభాస్కర్ పాల్గొనానరు.



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

టిడిపితోనే రాయదుర్గం అభివృద్ధి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

తెలుగుదేశం పార్టీతోనే రాయదుర్గం అభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని పలువురు యువకులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వెంకటస్వామినాయుడు అధ్వర్యంలో పార్టీలో చేరిన 40 మంది యువకులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపికి 15వేల మెజారిటీ తగ్గకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా 2014-19 మధ్యకాలంలో తాను రాయదుర్గానికి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. ఇక్కడి ప్రజల పాతికేళ్ల కలను పట్టణ రహదారి విస్తరణ ద్వారా నెరవేర్చామని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ముఖ్యంగా రాయదుర్గంలో వ్యాపారస్తులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోలేక పోతున్నారన్నారు. సంఘ విద్రోహ శక్తులు, దందాలకు పాల్పడేవారిని తానేప్పుడూ ప్రోత్సహించలేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు ప్రశాంతి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెంకటేషులు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు మహబూబ్‌బాషా, ఇనాయత్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పుతున్న కాలవ శ్రీనివాసులు

మున్సిపల్ కార్మికుల భిక్షాటన





అనంతపురం, కళ్యాణదుర్గంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు



గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంతోపాటు ప్రధాన రహదారుల్లో హుండీలు పెట్టుకుని భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, కార్మిక సంఘం నగర కార్యదర్శి తిరుమలేశు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 16రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడం బాధాకరమన్నారు. అటు కార్మికులు, ఇటు ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భిక్షాటన చేపట్టినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం కార్మికుల్ని బెదిరిస్తూ ఎస్మా చట్టాని ప్రయోగించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఆదినారాయణ, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు నల్లప్ప, ఇంజనీరింగ్ నగర కార్యదర్శి ఓబుళపతి, పోతులయ్య, పారిశుధ్య అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి ఆది, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ముట్టడికి వెళ్లిన కార్మిక సంఘం నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కె.నరసయ్య ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక పొట్టి శ్రీరాములు కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జగదీష్, నాయకులు మల్లేష్, సూరి, దాసు, ప్రేమ్‌కుమార్, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణంలోప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిమ్మప్ప, వన్నూరుస్వామి, మురళి, రమణ, లక్ష్మినారాయణ, శాంతమ్మ, పద్మా, లక్ష్మి, కోమల తదితరులు పాల్గొన్నారు.

వెనక్కి తగ్గేదేలే..

ఎస్మాను వెనక్కి తీసుకోవాల్సిందే - నినదించిన అంగన్వాడీలు - వివిధ రూపాల్లో నిరసనలు



తాడిపత్రిలో 30 ఆకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విలేకరులు

అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా జిల్లావ్యాప్తంగా వినూత్న రూపాల్లో నిరసనలు తెలిపారు. ముఖ్యంగా సమ్మె చేయబట్టి 30 రోజులు కావస్తున్న సందర్భంగా 30 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట శిబిరం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వీరి నిరసనలకు స్నేహితుల నాయకులు రామాంజనేయులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, ఆటో యూనియన్ నాయకులు అజం బాషా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, జిల్లా కోశాధికారి జమున, నగర అధ్యక్షురాలు జయ భారతి, సెక్టోరియల్ లీడర్లు అరుణమ్మ, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా సమ్మె చేయబట్టి 30రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం 30 ఆకారంలో కూర్చొని నెలరోజుల సమ్మె కాలంతో 'జీతం లేదు.. గంజి లేదు' అంటూ నినాదాలు చేస్తూ ఖాళీ మూకట్లు చేత బట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో హరిదాసు వేషధారణతో నిరసన తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లోకి వచ్చే హరిదాసు వేషధారుడు వచ్చి మీ సమస్యలు చెబితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెబుతూ నిరసన తెలిపారు. అంతేగాకుండా 'భరతమాత బిడ్డలం.. ఆడబిడ్డలం.. ఆవేదన వినండి' అనే నినాదంతో రంగవల్లితో భరతమాత చిత్రం వేసి గొబ్బెమ్మలు పెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు కాత్యాయని, రత్నమ్మ, రైతుసంఘం జిల్లా నాయకులు ఆర్.కుళ్లాయప్ప, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, హరిదాసు వేషధారుడు, సిఐటియు నాయకులు నెట్టికంటయ్య, రైతుసంఘం మండల నాయకులు సంజీవరెడ్డి, సెక్టార్ లీడర్లు విమల, సుజాత, రత్నమ్మ, సుభాషిణి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో అంగన్వాడీలు 30వ ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండతోపాటు విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. వీరికి సిపిఎం సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ సర్కిల్ వరకూ కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజమోహన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమాదేవి, సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, విరూపాక్షి, సుధాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నారాయుడు, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, రంగమ్మ, శ్వేతనాగ, సరోజమ్మ, బుజ్జా, ధనలక్ష్మి, జ్యోతి, రామాంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట మండలంలో 30 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకులు మేరీ, రాధిక, చంద్రకళ, నెహ్రూన్, రుద్రమ్మ, మంగమ్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం కూడా కొనసాగింది. వీరికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, ఎపి రైతుసంఘం జి.వెంకటచౌదరి. వ.కా.సం మండల అధ్యక్షులు టి.పెద్దయ్య, మండల కార్యదర్శి బి.భాస్కర్‌రెడ్డి, నాయకులు భూషణ, రామచంద్రారెడ్డి, అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు జయలలిత, అనంతలక్ష్మి, శశికళ, రమాదేవి, అంగనవాడీలు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరంలో మహిళలు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పామిడి, ఎద్దులపల్లి సెక్టార్ నాయకురాళ్లు జయంతి, మహాలక్ష్మి, జె.ఎల్.నారాయణమ్మ, అంగన్వాడీలు భారతి, జ్యోతి, యశోద, అనిత, సేకున్ బి, సోఫియా, రజియా, రెహనా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం మండలంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. ఇందులో భాగంగా స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో సమ్మె చేయబట్టి 30 రోజులు పూర్తయిన సందర్భంగా అంగన్వాడీలు 30 ఆకారంలో కూర్చొని వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ప్రాజెక్టు లీడర్ తిప్పీరమ్మ, మండల అంగన్వాడీ లీడర్లు తిప్పిరమ్మ, వరలక్ష్మి, సుజాత, అనిత, త్రివేణి, సత్యమ్మ, సుజాత, సంతోషమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు కబడ్డీ ఆడుకుంటూ నిరసన తెలిపారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.సం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న, ప్రాజెక్ట్ లీడర్ రమణమ్మ, మండల అధ్యక్షురాలు భారతీయ, ప్రమీల, రత్నమ్మ, నాగేశ్వరమ్మ, రాజేశ్వరి, రాధిక, సుగుణ, కాంతమ్మ, భారతి, రామాంజనమ్మ, సాయి, కాంతమ్మ, నాగమ్మ, అనురాధ, శ్రీదేవి, హరిప్రియ, రుషింగుమ, లక్ష్మీ, ప్రశాంతి, సరస్వతి, మహేశ్వరి, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో మున్సిపల్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. ఇందులో భాగంగా రోడ్డుపై సమ్మె చేపట్టి 30 రోజుకు చేరిన సందర్భంగా 30 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, కసాపురం రమేష్, సాకే నాగరాజు, కెవిపిఎస్ జిల్లా నాయకుడు జగ్గలి రమేష్, పట్టణ అధ్యక్షుడు రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో అంగన్వాడీల సమస్యలను తెలుసుకుంటున్న హరిదాసు వేషధారుడు



శింగనమలలో మాట్లాడుతున్న వ్య.కా.సం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్



ఉరవకొండలో అంగన్వాడీల మానవహారం



పామిడిలో ఉరితాళ్లు వేసుకుని నిరసన



రాయదుర్గంలో సిఎం జగన్ చిత్రపటం వద్ద ప్రార్థనలు చేస్తున్న అంగన్వాడీలు

12న ప్రతిభా పురస్కారాలు పంపిణీ

రాయదుర్గం : పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 12న శారదాదేవి జ్ఞాన నిధి ట్రస్టు ద్వారా 29 మంది పేద ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు అర్చనానంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం 12న ప్రతిభ ఉన్న నిరుపేద ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు తెలిపారు.

యుటిఎఫ్ ధర్నాను అడ్డుకోవడం అప్రజాస్వామ్యం

రాయదుర్గం : యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో తలపెట్టిన 36 గంటల ధర్నాను పోలీసులు అడ్డుకోవడం బాధాకరమని యుటిఎఫ్ డి.హీరేహాల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌బాబు, రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాను అడ్డుకునేందుకు ఉపాధ్యాయులను ఎక్కడికక్కడే పోలీసులు నిర్బంధించడం మంచిది కాదన్నారు. పోలీసులతో ఉద్యమాన్ని అణిచివేయడం అప్రజాస్వామికమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నీటిఎద్దడి నివారణకు 'మెట్టు' చొరవ

రాయదుర్గం : మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా రాయదుర్గంలో ఏర్పడిన తాగునీటి ఎద్దడి నివారణకు ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి చొరవ తీసుకున్నారు. పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, వైసిపి 2వ వార్డు ఇన్‌ఛార్జి శివ సూచన మేరకు గోవిందరెడ్డి పట్టణంలో నాలుగు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యవసాయ అధికారిణికి సన్మానం

ఉరవకొండ : వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేసి ఉత్తమ అవార్డు అందుకున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు బుధవారం ఘనంగా సత్కరించారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ రంగానికి ఉమామహేశ్వరమ్మ చేసిన సేవలను గుర్తించిన వివేకానంద యోగా కేంద్రం బెంగళూరు కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఉత్తమ అవార్డును అందజేశారు. దీంతో జైకిసాన్ సభ్యులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణిని సన్మానించారు. అనంతరం రైతుల సేఫ్టీ కిట్ల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధి నిరంజన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మడుగుపల్లిలో డీఎస్పీ పర్యటన

పుట్లూరు : మండల పరిధిలోని మడుగుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామస్తులతో మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దిలీప్‌కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం నాటాలని వినతి

బొమ్మనహాల్ : మండలంలోని కణేకల్లు-బొమ్మనహాల్ ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభం నాటాలని స్థానికంగా చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు బుధవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎఇ లక్ష్మీరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవనోపాధి కోసం తాము ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న బంకులపై విద్యుత్ తీగలు కింద వేలాడుతున్నాయన్నారు. కావున వెంటనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో చిన్న వ్యాపారులు ఆసీఫ్, బాషా, కొండయ్య, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

పుట్లూరు : మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎపిడి వెంకటరత్నం సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీల సంఖ్య పెంచి విరివిగా పనులు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఏప్రిల్ నుంచి కొత్త పనులు చేసేందుకు ఎస్టిమేట్లు తయారు చేయాలని టిఎలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

అనంతపురం : స్థానిక రాంనగర్‌లోని బాచ్‌పన్ ప్లే స్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో విచ్చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు భోగి పళ్లు పోసి, భోగి మంటలు వేసి, పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గంగిరెద్దు, హరిదాసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కొత్త పింఛన్లు పంపిణీ

ఉరవకొండ : మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, పంచాయతీ సెక్రటరీ సోమయ్య ఆధ్వర్యంలో కొత్తగా మంజూరు చేసిన వివిధ రకాల పెన్షన్లను విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమాశంకర్, వెల్ఫేర్ అసిస్టెంట్లు లక్ష్మీదేవి, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

సవీరా ఆసుపత్రిలో అరుదైన క్యాన్సర్ శస్త్రచికిత్స

లాప్రోస్కోపిక్ సర్జరీ చేసిన కిమ్స్ సవీరా వైద్యులు




శస్త్రచికిత్స వివరాలను వెల్లడిస్తున్న కిమ్స్ సవీరా వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

లక్షమందిలో ఇద్దరికి మాత్రమే వచ్చే మూత్రనాళాల్లో ట్రాన్సిషనల్ సెల్ క్యాన్సర్‌కు లాప్రోస్కోపిక్ పద్ధతిలో శస్త్రచికిత్స చేసి కణితిని అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు తొలగించి అరుదైన ఘనతను సాధించారు. కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ రవిశంకర్ తెలిపిన వివరాల మేరకు... 75 ఏళ్ల వృద్ధుడికి నెలరోజుల నుంచి మూత్రంలో రక్తం పోతోందని, కుడివైపు నడుం నొప్పి ఉందని, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉండటంతో స్థానికంగా ఆర్‌ఎంపీలకు చూపించుకున్నారు. తర్వాత వేర్వేరు ఆస్పత్రులకు తిరిగి కిమ్స్ సవీరా ఆసుపత్రికి వచ్చారు. ఇక్కడ మూత్రనాళంలో 8.5 సెంటీమీటర్ల కణితి ఉన్నట్లు తేలింది. అది కుడివైపు మూత్రపిండంలోకి విస్తరించడంతోపాటు రక్తంతో నిండి ఉన్నట్లు గుర్తించి లాప్రోస్కోపిక్ పద్ధతిలో నెఫ్రో యూరేటరెక్టమీ అనే శస్త్రచికిత్స చేసి రోగికి పూర్తిగా సాంత్వన కలిగించినట్లు తెలిపారు. ఈ చికిత్సకు దాదాపు మూడు గంటల సమయం పట్టిందన్నారు. ఎలాంటి సమస్య లేకపోవడంతో రోగిని నాలుగో రోజు డిశ్చార్జి చేసినట్లు వివరించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్‌కు కోసం ఏర్పాటు చేసిన సంప్రదాయ వంటలు

గుంతకల్లు : పట్టణ శివారులోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ కళాశాలలో (ఎంబిఎ, ఎంపిఎ) పిజి కళాశాలలో సీనియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెషర్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వంటల్లో 'విత్ ఔట్ ఫైర్' అనే కార్యక్రమంలో తమ ప్రతిభను విద్యార్థులు గ్యాస్ వాడకుండా వివిధ రకాలైన పోషక విలువలు కలిగి, వైవిధ్య భరితమైన ఆలోచనలతో కూడిన పలు వంటకాలను తయారు చేసి అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు మంజునాథ, కరస్పాండెంట్ ఓంకారప్ప, జీబీసీ ఇంజనీరు పవన్, ప్రిన్సిపల్ వై.హనుమాన్ ప్రసాద్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రఘు సైనిక్ స్కూల్‌ను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న రఘు సైనిక్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా కేంద్రంలో డిఇఒ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సెలవు దినాల్లో పాఠశాల నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యాంగా పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. అంతేగాకుండా సైనిక్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, గిరి, నగర అధ్యక్షుడు భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను పరిరక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొమ్మనహాల్ : దళితుల భూమును పరిరక్షించాలని ఎంఆర్‌పిఎస్ రాయలసీమ ప్రతినిధి అక్కులప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొమ్మనహాల్ మండలంలోని గోవిందవాడ, శ్రీధర్‌ఘట్ట గ్రామాల్లో కొందరు దళితుల భూమును అధికారులు తారుమారు చేశారన్నారు. వాటిని సరిచేసి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టైగర్ వన్నూస్వామి, దుదుతుకుంట తిమ్మరాజు, ఉరవకొండ చెన్నప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కమిటీల నియామకం

అనంతపురం : నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపట్టేందుకు బుధవారం స్థానిక అర్బన్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పలు కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న జయహో బీసీ సదస్సు, 18న ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని లలిత కళాపరిషత్‌లో రక్తదాన శిబిరంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, 20న ముస్లిం మైనారిటీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం కమిటీలను నియమించినట్లు తెలిపారు.

హాల్ టికెట్లు, ఫీజులకు ముడిపెట్టొద్దు..

అనంతపురం : జెఎన్‌టియు అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల హాల్ టికెట్లు ఇచ్చేందుకు కళాశాలల ఫీజులతో ముడిపెడితే చర్యలు తప్పవని వర్సిటీ యంత్రాంగం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. ప్రభుత్వం ప్రతి త్రైమాసికం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన విడుదల చేస్తోందన్నారు. అయినప్పటికీ నిధులు విడుదల కాలేదని, ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలంగాణ సిఎంను కలిసిన జెసి పవన్‌రెడ్డి

అనంతపురం : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జిల్లాకు చెందిన మాజీ ఎంపీ దివాకర్‌రెడ్డి తనయుడు జెసి పవన్‌కుమార్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణకు సరిహద్దుగా ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలు, రాయలసీమ జిల్లాల్లో ఐటీ రంగ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరినట్లు పవన్‌రెడ్డి తెలిపారు.



తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న జెసి పవన్‌కుమార్‌రెడ్డి

నీలూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



మహిళతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్

ప్రజాశక్తి-పామిడి


మండలంలోని నీలూరు గ్రామంలో బుధవారం 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల కన్వీనర్ ముసలిరెడ్డి, మాజీ సర్పంచి తిప్పన్న, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ డీలర్ ఓబులేష్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, సంజీవరెడ్డి, గంగరాజు, రామంజి, గంగవర్ధన్, హసిత్, చిన్న మస్తాన్, నరసింహా, హరి, ఓబులేష్, మాజీ సర్పంచి సుంకన్న, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, తెలుగు యువత సుధాకర్‌నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్ అడిగితే అరెస్టు చేస్తారా..? : డివైఎఫ్ఐ

అనంతపురం కలెక్టరేట్ : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అడిగితే అక్రమంగా అరెస్టు చేస్తారా.. అంటూ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ విడుదల చేయాలని 'ఛలో సీఎం క్యాంప్ ఆఫీస్' (విజయవాడ)కు పిలుపునిస్తే కనీసం నాయకులను కలవనీయకుండా ఎమర్జెన్సీని తలపించే విధంగా యువకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడకుండా వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మాదిగ యువతకు అవకాశం కల్పించాలి

దళిత సంఘాల నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

తెలుగుదేశం, వైసిపి పార్టీలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మాదిగ యువకులకు టికెట్ ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత సంఘం నాయకులు బండారు కుళ్లాయప్ప మాట్లాడుతూ ఇంతవరకూ పనిచేసిన ఎమ్మెల్యేలు, మంత్రులు, దళితుల సంక్షేమం, అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. కావున దళిత యువకులకు అవకాశం కల్పిస్తే దళితులు అభివృద్ధి చెందే అవకాశం ఉదన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.కదిరప్ప, ముకుందాపురం నాగరాజు, రామాంజనేయులు, కణంపల్లి రాజా, బూదేడు మల్లికార్జున, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దపప్పూరు : ద్విచక్ర వాహనంలో నుంచి అదుపు తప్పి కింద పడి మహిళ మృతిచెందిన ఘటలన బుధవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలో నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా ఉచ్చకాయలపల్లికి చెందిన రామలక్ష్మి (22)కి నాలుగు నెలల క్రితం పెద్దవడుగూరు మండలం కల్ల గూడూరుకు చెందిన శ్రీనివాసరెడ్డితో వివాహమైంది. ఈనేపథ్యంలో భార్యాభర్తలు ఉచ్చకాయలపల్లి నుంచి కల్ల గూడూరుకి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రెడ్డిపల్లి సమీపంలోకి రాగానే రామలక్ష్మికి ఫిట్స్ వచ్చి వాహనం నుంచి కింద పడింది. వెంటనే అటుగా వెళ్తున్న ఓ ప్రయివేటు వాహనంలో అనంతపురం తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈమేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.